క్లుప్తంగా

వాడ్రేవుపల్లి డ్రైన్‌పై వంతెన నిర్మాణానికి కార్యాచరణ



వాడ్రేవుపల్లి డ్రైన్‌పై ఏర్పాటు చేస్తున్న క్రాస్ బండ్

మామిడికుదురు: లూటుకుర్రులో వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై రూ.1.01 కోట్లతో శిథిల కాజ్‌వే స్థానే నూతనంగా వంతెన నిర్మాణానికి శుక్రవారం కార్యాచరణ చేపట్టారు. దీనిలో భాగంగా వంతెనకు ఇరు వైపులా క్రాస్‌బండ్లు ఏర్పాటు చేస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన కాజ్‌వే శిథిలస్థితికి చేరింది. మండలంలోని ముంపు నీరు ఈ కాజ్‌వే ద్వారా గోదావరి నదిలో కలవాల్సి ఉంది. కాజ్‌వే పాడైపోవడంతో ముంపు నీరు సక్రమంగా పారక ఏటా వర్షాకాలంలో రైతు తీవ్ర ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. కాజ్‌వే స్థానే నూతనం వెంతన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంతో కాలం నుంచి రైతులు డిమాండ్ చేస్తున్నా ఇంత వరకు దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇంత కాలానికి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కాజ్‌వే స్థానే వంతెన నిర్మాణానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్యాచరణ చేపట్టారు. ఇటీవల దీని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వేసవిలో వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు. క్రాస్ బండ్ల నిర్మాణం అనంతరం నీటిని తొలగించి శిథిల కాజ్‌ను తొలగిస్తామని, కుడి వైపు క్రాస్ బండ్ మీదుగా కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తామని పీఆర్ ఏఈ చిన్నంరాజు తెలిపారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి



వనుము రాంబాబు (ఫైల్)

కొత్తపేట: మండలంలోని వానపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం సభ్యుడు వనుము రాంబాబు (51) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాంబాబు మృతిపై స్థానికేతర ప్రాంతంలో ఉన్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాంబాబు మృతితో ఎంతో నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. రాంబాబు మృతదేహాన్ని శుక్రవారం ఉదయం పార్టీ నాయకులు సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏజీపీ శ్రీనివాసు రాజీనామా



నామాల శ్రీనివాసు

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా పని చేస్తున్న నామాల శ్రీనివాసు తమ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఈనెల 23న పంపించినట్లు శ్రీనివాసు శుక్రవారం విలేకరులకు తెలిపారు. గత రెండున్నరేళ్ల నుంచి పేదలకు న్యాయసాయాన్ని అందించేందుకు అవకాశం లభించడంపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వ్యక్తిగత కారణాలతోనే ఏజీపీకి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సాయం

అంబాజీపేట: ఇటీవల పుల్లేటికుర్రు శివారు వాజ్‌పేయి కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయం అందజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, సభ్యుడు బీవీ హనుమంతరావుల ఆధ్వర్యంలో బాధితుడు గాడ నాగబాబుకు టార్పాలిన్, వంట సామగ్రి, హైజెనిక్ కిట్స్, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఉప సర్పంచ్ వీరా రవి, బెహరా వీర సందీప్, ఎన్.శ్రీనివాస్, సూర్యచంద్రరావు, వై.రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని దేవరపల్లి గ్రామ శివారు చెలిరేవుకి చెందిన కళ్యాణం ఏసురాజు, సాయి కుమార్ అన్నదమ్ములు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు ఒకరికి కాలు చేతులు మెడ కింది భాగంలో ఎముకలు విరిగిపోయాయి. ఇంకొకరికి కాలు విరిగిపోయింది. వైద్యానికి రూ.5 లక్షల వరకు ఖర్చు అయింది. వీరికి ఇంకా ఒక సర్జరీ చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. అంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో సహాయం కోసం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరారు. దేవరపల్లిలోని బాధితులకు ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.15 వేల ఆర్థికసాయం అందజేసినట్టు సభ్యులు తెలిపారు.



ఆలమూరులో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



మామిడికుదురులో శిలువ ఊరేగింపులో పాల్గొన్న క్రైస్తవులు



బి.సావరంలో భారీ శిలువతో ఫాదర్ జోసఫ్



పెదకందాలపాలెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ జి.దానియేలు

మానవాళి రక్షణకే ఏసు శిలువ మరణం

- గ్రామగ్రామానా గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు
- శిలువతో క్రైస్తవుల ర్యాలీలు



కొత్తపేట యెరూషలెం చర్చిలో ప్రసంగిస్తున్న బిషప్ అబెద్నగో



పుల్లేటికుర్రులో ఏసు గీతాలాపనతో ర్యాలీ చేస్తున్న భక్తులు

కొత్తపేట: ఈ లోకంలో మానవాళి రక్షణ కోసమే ఏసు క్రీస్తు తన ప్రాణాన్ని శిలువపై బలిగా అర్పించారని స్థానిక ప్రవచన దేవుని సంఘం, యెరూషలెం చర్చి పాస్టర్ బిషప్ జి.అబెద్నగో అన్నారు. గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని గ్రామ గ్రామాన క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. చర్చిల్లో క్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దానిలో భాగంగా స్థానిక పినిపే వారిపేట ప్రవచన దేవుని సంఘం, యెరూషలెం చర్చి పాస్టర్ అబెద్నగో ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని నిర్వహించారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. మానవాళి పాప పరిహారార్థం మరణించి, పాతిపెట్టబడి, తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచి, నరకం నుంచి విడుదల ఇచ్చి, నిత్య జీవము లేక పరలోకం చేరే భాగ్యం కల్పించడంతో ఈ శుక్రవారాన్ని శుభ శుక్రవారంగా పరిగణిస్తారన్నారు. అనంతరం పురవీధుల్లో శిలువ యాత్ర నిర్వహించారు. మండలంలోని పలివెల రోమన్ కతోలిక్ దేవాలయం తరఫున గ్రామ పురవీధుల్లో 'బహిరంగ శిలువ ప్రదర్శన' పేరుతో ఊరేగింపు నిర్వహించారు. చర్చి వద్ద ఈ ఊరేగింపును ప్రముఖ క్రైస్తవ మత బోధకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాల పాస్టర్లు, సంఘ పెద్దలు, గురువులు, విశ్వాసులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాడపాలెం ప్రేయర్ పవర్ చర్చిలో బిషప్ అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం పరిశుద్ధ మార్కు లూథరన్ చర్చిలో పేరిష్ పాస్టర్ రెవ గోరింకల నవరత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, కీర్తన, ధ్యానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మన్నా చర్చి, అలాగే మండలంలోని కొత్తపేట, వాడపాలెం, వానపల్లి, బిళ్లకుర్రు, మోడేకుర్రు, అవిడి, కండ్రిగ, పలివెల, గంటి, మందపల్లి గ్రామాల్లోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మానవాళి కోసం శిలువపై బలియాగం

అంబాజీపేట: పాప విముక్తి కోసం శిలువపై బలియాగం చేశారని ఇరుసుమండ సెయింట్ జోసఫ్ చర్చి ఫాదర్ వినయ్‌సాగర్, ఫాదర్ ఏసు అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా అంబాజీపేట మండలం ఇరుసుమండ, అంబాజీపేట చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌సాగర్ మాట్లాడుతూ మండుటెండలో శిలువపై వేలాడుతూ క్రీస్తు పలికిన ఏడు మాటలు మానవాళికి ఆశీర్వాదకరంగా ఉన్నాయన్నారు. అనంతరం ఏసు క్రీస్తు శిలువారాధనను ప్రతిబింబించేలా గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో గీతాలాపనలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లి సూర్యారావు, నూకపెయ్యి చిన్న, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా చేసుకున్నారు. సమస్త మానవాళి సంరక్షణకు ప్రభువైన క్రీస్తు శిలువపై ప్రాణాలను అర్పించిన మహా త్యాగ ఫలితంగా ప్రపంచ ప్రజానీకాన్ని పాప విముక్తులుగా చేసిన రోజును గుడ్‌ఫ్రైడేగా నిర్వహించుకోవడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఆయా ప్రార్థనాలయాల్లో క్రైస్తవులు ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని, మానవాళిపై ప్రేమ, నిస్సహాయులపై కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం కలిగి ఉండాలని పలువురు మత ప్రబోధకులు వివరించారు. అనంతరం మానవాళి కోసం క్రీస్తు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుని స్మరించుకున్నారు.

మామిడికుదురు: గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మామిడికుదురు, నగరం గ్రామాల్లో క్రైస్తవులు సిలువ ఊరేగింపులో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు. సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన శిలువపై ప్రాణాలు అర్పించాడని కీర్తించారు. ప్రాణాలు అర్పించిన మూడో రోజు సమాధి నుంచి లేచాడన్నారు. పాశర్లపూడి, పాశర్లపూడిలంక, అప్పనపల్లి, పెదపట్నంలంక, మొగలికుదురు, మగటపల్లి, గెద్దాడ, గోగన్నమఠం, లూటుకుర్రు, ఆదుర్రు తదితర గ్రామాల్లో జరిగిన గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

రాజోలు: మానవాళి పరిరక్షణ కోసమే ప్రభువైన ఏసు క్రీసు ఈ లోకానికి వచ్చారని బి.సావరం రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ కె.జోసఫ్ అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని పాలగుమ్మి నుంచి బి.సావేరం శోభనా స్కూల్ వరకు భారీ శిలువను మోస్తూ ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, విధేయత, సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. సాటి మనిషిపై మానవత్వం చూపించాలన్నారు. ఫాదర్ మార్కోం, కె.బుచ్చిబాబు, జి.ఫౌలు, సంఘ పెద్దలు కలిగిత శ్రీను, కట్టా జాన్, కోన రాజు, పీవీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: నాగుల్లంక శివారు పెదకందాలపాలెంలోని న్యూజేరూషలెం మినిస్ట్రీస్‌లో రెవరెండ్ జి.దానియేలు ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు ఘనంగా జరిగాయి. దానియేలు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి అందరూ ప్రార్థించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇతరులకు తమవంతు సహాయం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌జేఎం కార్యదర్శి యు.జాన్‌బాబు, గ్రేస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, పాస్టర్ జె.కరుణకుమార్, షేక్ అబ్రహం, ఫిలిఫ్ గిరీష్, కోనసీమ నలుమూలలకు చెందిన వందలాది మంది క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక బెతెస్థ ప్రార్థనా మందిరంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాస్టర్ ఎన్.వి.రావు మాట్లాడుతూ యేసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను బోధిస్తూ క్షమా గుణం, బాధ్యత, ప్రేమ, పాపపు ఒప్పుకోలు, దయా గుణాలను అలవర్చుకోవాలన్నారు. పాపుల కోసమే యేసుక్రీస్తు ఈ లోకంలో జన్మించి, శిలువలో రక్తం చిందించి ప్రాణాలు అర్పించారని కొనియాడారు. పలు గ్రామాల నుంచి వేలాది విశ్వాసులు హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం హాజరైన విశ్వాసులకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఎన్.అద్భుత్ రాజా, పాస్టర్ ఎన్.రక్షణ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

బండారు బహిరంగ క్షమాపణలు చెప్పాలి



మాజీ ఎమ్మెల్యే బండారు వ్యాఖ్యలను నిరసిస్తూ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో ఇటీవల నిర్వహించిన ప్రజాగళంలో అనుచిత వ్యాఖ్యలతో ప్రజల మనోభావాలను గాయపర్చిన మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బహిరంగ క్షమాపణలు చెప్పాలని మండల వైఎస్సార్ సీపీ డిమాండు చేసింది. స్థానిక నవాబురోడ్డులోని ఇటుక బట్టీల వద్ద మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి, సర్పంచ్ దంగేటి చంద్రకళ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే బండారు నిరాశ, నిస్పృహలతో వాటిని అందుకుంటున్న ప్రజలను సోమరిపోతులుగా అభివర్ణించడం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతియే లక్ష్యంగా పాలన సాగిస్తూ అనేక కుటుంబాలకు అన్ని విధాలుగా కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని కొనియాడారు. కరోనా సమయంలో ఇంట్లో దాక్కున్న టీడీపీ నేతలకు సంక్షేమ పథకాలు అందుకుని స్వయం స్వావలంబన సాధిస్తున్న ప్రజలు సోమరిపోతుల మాదిరిగానే కనిపిస్తారని ఎద్దేవా చేశారు.

ఓటు అడిగే నైతిక హక్కు లేదు

నియోజకవర్గ ప్రజలను సోమరిపోతులుగా భావిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు, టీడీపీ నేతలకు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని వైఎస్సార్ సీపీ నేతలు విమర్శించారు. గత పదేళ్ల కాలంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చొప్పెల్ల గ్రామాభివృద్ధికి, సంక్షేమ పథకాలకు రూ.42.36 కోట్లు మంజూరు చేసిన సంగతిని వారు గుర్తు చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తన ఎమ్మెల్యే కోటాలో కాపు కల్యాణ మంటపానికి రూ.50 లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాలు భవనానికి రూ.28 లక్షలు మంజూరు చేయడంతో పాటు అనేక రోడ్లను, డ్రైనేజీలను నిర్మించారన్నారు. నియోజకవర్గం వైఎస్సార్ సీపీని ఎదుర్కొలేని టీడీపీ నేత బండారు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, నామాల శ్రీనివాసు, తోరాటి రాంబాబు, వాసన రాజు, మొర్త వెంకట నరేష్, నాయుడు ప్రసాద్, దొండపాటి చంటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక కొత్తపూల ఉత్సవాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ఆవరణలో గురువారం రాత్రి మన్యసీమ నుంచి తీసుకు వచ్చిన మోదుగుపూలతో అలంకరించిన పెద్దగరగతో మూడో విడత కొత్తపూలు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చర్మ వాయిద్యాల దరువుకు అనుగుణంగా ఆలయ ఆసాదుల బృంద సభ్యులు గరగలను నెత్తిన ధరించి చేసిన నృత్యాలు భక్తులను అలరించింది. చిన్నారుల చేసిన గరగ నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కొత్తపూల ఉత్సవాలను తిలకించారు. పూలగరగకు పూలు, అగరవత్తులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన శక్తివేషాలు, విచిత్ర వేషధారణ, కోయ నృత్యాలు తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. చల్ల గరగ రూపంలో ఉన్న అమ్మవారికి నిర్వహించిన గ్రామోత్సవం ద్వారా ఇంటింటికీ దర్శనమిచ్చింది. ఇప్పటికే విద్యుత్‌లంకరణ, చలువ పందిళ్ల ఏర్పాటు చురుగ్గా సాగుతుంది. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం పాలనతో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



సఖినేటిపల్లిపాలెం సెంటర్లో పార్టీలో చేరిన వారితో అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో విప్లవాత్మక మార్పులు చేసి చూపించారని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గురువారం రాత్రి సఖినేటిపల్లిపాలెంలో మాజీ ఎంపీటీసీ ఆరిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో బీసీ గౌడ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు అన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గొల్లపల్లి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, సమగ్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. సీఎం జగన్ అమలు చేసిన ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాలతో పేదలకు ఎంతో ఊరట లభించిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పార్టీ కేడర్, అభిమానులు ఆయనను శాలువాతో సత్కరించింది. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ కట్టా వెంకాయమ్మ, నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం, నాయకులు ఈద రవిరెడ్డి, రుద్రరాజు రంగరాజు, నల్లి డేవిడ్, పసలపూడి భగవాన్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ భర్తపై కాంట్రాక్ట్ ఉద్యోగి దాడి



ముక్కామలలో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

అంబాజీపేట: ముక్కామలలో ఆర్టీసీ బస్‌స్టేషన్ కూల్చివేతపై తలెత్తిన వివాదంపై స్థానిక ఎంపీటీసీ వనచర్ల విజయదుర్గ భర్త వెంకట నాగమల్లేశ్వరరావుపై పంచాయతీ కాంట్రాక్ట్ సిబ్బంది పీడబ్ల్యూడీ ట్యాంకు వాచర్ కొప్పిశెట్టి సూర్య శివ దుర్గాప్రసాద్ శుక్రవారం దాడి చేశాడని స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించి బాధితుడు వెంకట నాగమల్లేశ్వరరావు, నేదునూరి ఏడుకొండలు, స్థానికులు మాట్లాడుతూ స్థానికుడు బండారు మల్లి, కొప్పిశెట్టి సూర్య శివ దుర్గాప్రసాద్‌లు బస్‌స్టేషన్‌ను కూల్చేందుకు ప్రయత్నిస్తున్నాడని తక్షణమే అడ్డుకోవాలంటూ జిల్లా కలెక్టర్, కొత్తపేట ఆర్డీవో, తదితర అధికారులకు వినతి పత్రాలను అందించామన్నారు. దాంతో బస్‌స్టేషన్‌ను ఆర్ఐ, వీఆర్వోలు వచ్చి విచారణ చేపట్టారన్నారు. ఈ సమయంలో సూర్యశివ దుర్గాప్రసాద్ వచ్చి నా పేరును అధికారులకు ఎందుకు ఇచ్చావు, ఫిర్యాదు ఎందుకు చేశావంటూ అధికారుల సమక్షంలోనే వెంకట నాగమల్లేశ్వరరావుతో ఘర్షణకు దిగి గొడవ పడ్డారన్నారు. దాంతో ఎంపీటీసీ భర్త 100కు కాల్ చేయడంతో అంబాజీపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. ఎంతో మంది ప్రయాణికులకు నీడనిస్తున్న బస్‌స్టేషన్ తొలగించవద్దని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి బస్‌స్టేషన్ కూల్చకుండా నిలుపుదల చేయాలని అధికారులను కోరారు. దుర్గాప్రసాద్‌పై ఎంపీటీసీ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవరపల్లి చినబాలయోగి, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శుక్రవార ప్రార్థనలు

మామిడికుదురు: ముస్లిం పవిత్ర రంజాన్ నెలలోని మూడో శుక్రవారం సందర్భంగా మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మామిడికుదురు సున్నీ జామియా మసీదులో షబ్బర్ అలీజైదీ, షియా మసీదులో తారిఖ్ అన్వర్ రజ్వీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత ప్రబోధకుడు రంజాన్ నెలలోని 18వ రోజు శుక్రవారం ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. ఈ రోజు చేసే ప్రార్థనలను అల్లా తప్పనిసరిగా ఆలకిస్తాడని, కోరికలు నెరవేరతాయన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నమాజుల్లో పాల్గొన్నారు. మండలంలోని మసీదులు భక్తులతో కిటకిటలాడాయి.

విజయానికి బూత్ కమిటీ ప్రణాళికలే కీలకం



బూత్‌కమిటీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి బూత్ కమిటీల ప్రణాళికలే కీలకమని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం తాటిపాకలో గొల్లపల్లి స్వగృహం వద్ద మామికుదురు మండలంలోని రాజోలు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఏడు గ్రామాల బూత్‌కమిటీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ ప్రజావసరాలను గుర్తించి వారి సంక్షేమానికి సీఎం జగన్ బాటలు వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని విజయపథం వైపు నడిపించాలని బూత్ కన్వీనర్లను కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివ, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు సూరిశెటి బాబి, గ్రీవెన్స్ సెల్ సభ్యుడు కటకంశెట్టి ఆదిత్య, జిల్లా మైనార్టీ సెల్ సభ్యుడు ఎండీవై షరీఫ్, నాయకులు కట్టా శ్రీనివాస్, కుసుమ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

ఆలమూరు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో శుక్రవారం అక్రమ మద్యం బాటిళ్ల ధ్వంసం జరిగింది. రాష్ట్ర ఎస్ఈబీ డిప్యూటీ కమిషనరేట్ ఆదేశాల మేరకు అమలాపురం ఏఎస్పీ అమర్‌బాబు సమక్షంలో ఎస్సై ఎ.సత్యవేణి ఆధ్వర్యంలో సుమారు రూ.90 వేలు విలువైన 1152 మద్యం బాటిళ్లు, 184 లీటర్ల సారా ధ్వంసం చేశారు. అందులో 720 బాటిళ్లు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కాగా 216 బాటిళ్లు పెయిడ్ లిక్కర్‌కు సంబంధించినట్లు ఆమె పేర్కొన్నారు. అక్రమంగా సారా తయారు చేసినా లేక విక్రయించినా, అక్రమ మద్యాన్ని తరలిస్తున్న కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ అమర్‌బాబు హెచ్చరించారు. ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లోని ఎక్కడైనా అక్రమ మద్యం ఆనవాళ్లు ఉంటే సత్వరమే 9959841282 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య పరీక్షల శిబిరం

రాజోలు: దివ్యాంగ బాలలకు ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఎంతో మేలు చేస్తుందని విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బొరుసు సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం రాజోలు దొరగారితోటలోని భవితా కేంద్రం వద్ద మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల పరిధిలోని 18 సంవత్సరాల లోపు దివ్యాంగ బాలబాలికలకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 126 మంది దివ్యాంగ బాలలకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వినికిడి లోపం ఉన్న వారిని గుర్తించి హియరింగ్, నడవలేని స్థితిలో ఉన్న వారికి వీల్ ఛైర్స్ పంపిణీ చేశారు. ఎంఈఓ నల్లి మనోహరం, కోఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, ఎంఈఓ-2 టీఎస్‌కేడీ ప్రసాదరావు, ఐఈఆర్పీలు సుబ్బలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

నేడు వాడపాలెం చానళ్లకు సాగునీటి సరఫరా

కొత్తపేట: వంతుల వారీగా సాగు నీరు సరఫరాలో భాగంగా వాడపాలెం లాకు పైన వాడపాలెం ఓల్డ్, న్యూ చానళ్లకు శనివారం నుంచి సాగునీరు సరఫరా చేస్తామని ఇరిగేషన్ శాఖ కొత్తపేట సెక్షన్ ఆఫీసర్ వి.నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ (24 గంటలు) నీరు సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

నేడు రావులపాలెంలో ప్రత్యేక శిబిరం

కొత్తపేట: సమగ్ర శిక్ష సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో దివ్యాంగ బాలలకు నిపుణులైన వైద్యులతో ఉచిత పరీక్షలు, ఉపకరణాలు అందించడం కోసం శనివారం రావులపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తెలిపారు. చెవిటి, మూగ, నడవలేని పిల్లలకు పరీక్షలు చేసి, చెవి మెషీన్లు, వీల్ ఛైర్స్, కాలిపర్స, రూలేటర్స్ స్ట్రక్చర్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందుకు నియోజకవర్గంలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలకు సంబంధించి మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ రావులపాలెంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగ బాలల తల్లిదండ్రులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ లైన్లో ట్రీ కటింగ్ నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరం విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ సీహెచ్ రాజేంద్ర శుక్రవారం తెలిపారు. మామిడికుదురు, నగరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. దీంతో పాటు మగటపల్లి సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల్లో భాగంగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు మగటపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.